వైఎస్ఆర్

చట్ట పరిధిలో న్యాయం చేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్‌పి ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. కార్యక్రమంలో డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం, మహిళా పిఎస్ డిఎస్‌పి బాలస్వామిరెడ్డి పాల్గొన్నారు.

రేషన్‌లో కోత

- బియ్యం, చక్కెరకే పరిమితం
- ఆరు నెలలుగా అందని కందిపప్పు
- సెలవుల్లో ఇంటికి వచ్చిన బంధువులతో మరింత పెరిగిన ఖర్చులు
- సామాన్యుడికి భారమవుతున్న జీవనం

రేషన్ కోసం ఎదురు చూస్తున్న కార్డుదారులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని, ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్ మొదటి నుంచి సమీక్షల్లోనూ చెబుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది కూటమి సర్కారు ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెడుతుందంటూ చెప్పుకొచ్చారు. అయితే ఆచరణలో పూర్తి స్థాయిలో సరుకుల పంపిణీపై దృష్టి సారించలేకపోతున్నారు. ఆరు నెలలుగా రేషన్‌లో కందిపప్పు సరఫరా కావట్లేదు. కేవలం బియ్యం, పంచదారతోనే సరిపెడుతున్నారు. జిల్లాలో 1,275 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 5.86 లక్షల రేషన్ కార్డులున్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. ఆరు నెలలుగా కందిపప్పు కేటాయించడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఫిబ్రవరి నెలలో 30 శాతం కార్డులకు బఫర్ స్టాక్ నుంచి పంపిణీ చేశారు. మార్చి నెలలో అసలు ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఏప్రిల్ నెలలోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలో ఒక్క లబ్ధిదారునికి కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు పూర్తిగా నిలిపివేయడంతో పేదలు పప్పుచారుకు కూడా దూరమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్దిదారులకు సరఫరా చేయాల్సిన సరుకులను ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇచ్చారు. ప్రతి నెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేశారు. పండుగ తోఫాలకు స్వస్తి పెట్టారు. గత ఏడాది జూన్ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కాని ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. కనీసం కందిపప్పు కూడా సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశే మిగిలింది. ఉగాది, రంజాన్ పండుగలకు ప్రభుత్వం అన్ని రేషన్ సరుకులను ఇస్తుందని లబ్దిదారులు ఆశించినా అడియాశే అయింది.

జూన్ నుంచి సరఫరా అంటున్న అధికారులు

వచ్చే నెల నుంచి కందిపప్పుతో పాటు రాగులు కూడా సరఫరా చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కందిపప్పు, రాగులను కొనుగోలు చేసే యోచనలో ప్రభుత్వ ఉన్నట్టు తెలుస్తుంది. జూన్‌లో నైనా పేదలకు కందిపప్పు అందిస్తారా లేదా అన్న సందిగ్ధత నెలకొంది.

ఇంటింటికి సరఫరా చేయని రేషన్

ఎన్‌యుడి వాహనా ద్వారా రేషన్ ఇంటింటికి సరఫరా చేయాలి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అమలు కాలేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం పులివెందులలో ఒకటి, రెండు వాహనాల ద్వారా మాత్రమే నామ మాత్రంగా సరఫరా చేస్తున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ఎన్‌యుడి వాహనాల ద్వారా సరఫరా చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినా ఫలితం శూన్యం. కొంతమంది రేషన్ డీలర్లు 5వ తేదీ వరకు మాత్రమే రేషన్ ఇచ్చి షాపులు మూసివేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ప్రతి నెలా 15 వరకు సరఫరా చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

బహిరంగ మార్కెట్లో కొనలేక

ప్రజలు నిత్యం వాడే కందిపప్పు నాణ్యతను బట్టి ధర రూ.140 నుంచి 150 వరకూ ఉంది. రాయితీ పోను కిలో కందిపప్పు రూ.67కే లభిస్తున్నందున రేషన్ షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నా కూటమి సర్కారు సైతం పట్టించుకోవడం లేదు. కందిపప్పు ధర భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దానికి తోడు పేదలపై భారాలు రోజురోజుకు అధికమవుతున్నాయి. దీంతో కందిపప్పు కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తున్నామనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్‌ల ద్వారా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేపట్టింది. అది నాణ్యత తక్కువగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరపై రూ.10 నుంచి రూ.20 వరకు కిలోపై ధర తగ్గిస్తున్నా, ఇది రెండో రకం కందిపప్పు కావడంతో తీసుకునేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు.

కంది పప్పు ఇవ్వాలి

ఆరు నెలల నుండి కందిపప్పు నిత్యావసర సరఫరాతో పాటు ఇవ్వకపోవడంతో పప్పు అన్నంకు దూరం అవుతున్నాం. కూలీనాలీ చేసుకుని బతికే మేము బయటి మార్కెట్లో రూ.150 నుంచి రూ.160 పెట్టి కేజీ కందిపప్పు కొనగలమా.. ప్రభుత్వం బియ్యం, చక్కెరతోపాటు రెగ్యులర్ గా కందిపప్పును అందించాలి.

- జయమ్మ, వ్యవసాయ కూలీ, పులివెందుల

పప్పు తినే పరిస్థితి కనపడటం లేదు

రేషన్లో కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. మూడు నెలల నుండి కంది బేడలు ఇవ్వడం లేదు. బయట మార్కెట్‌లో రేటు ఎక్కువ ఉంది. ప్రభుత్వం ఇచ్చేది తక్కువ రేటు ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం ఇచ్చే రేషన్ సరుకుల్లో కందిపప్పు కూడా ఇవ్వాలి. కందిపప్పు బంద్ చేయడం ద్వారా సాధారణ కూలీలు, ప్రజలు పప్పు తినే పరిస్థితి కనపడటం లేదు.

- సుజాత, గృహిణి, పులివెందుల

ఖర్చులు బాగా పెరిగాయి

పిల్లలు ప్రభుత్వ హాస్టల్లో ఉండి చదువుతున్నారు. సెలవులు కావడంతో ఇంటికి వచ్చారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలు, దానికి తోడు రేషన్ లో కోతలు వల్ల పిల్లలకు మంచి తిండి పెట్టలేని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం రేషన్ షాపులలో రాయితీలతో సరుకులు సరఫరా చేయాలి.

-చింతలమ్మ, చిరు వ్యాపారి, పులివెందుల

బదిలీల విధానం అస్తవ్యస్తం

ప్రభుత్వ తీరు మారకపోతే 15న విద్యా భవన్ ముట్టడి
డిఇఒ కార్యాలయం వద్ద ధర్నాలో యుటిఎఫ్ నేతల హెచ్చరిక

డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునఃవ్యవస్థీకరణ, బదిలీలు, ఉద్యోగ్యోన్నతుల ప్రక్రియ అస్తవ్యస్తంగా తయారైందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. పాఠశాల పునః వ్యవస్థీకరణ, బదిలీలు, పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలన సాగిస్తామని చెప్పారు. కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సమస్యలను విస్మరించడం తగదన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీవోను రద్దుచేసి, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షిస్తామని పదేపదే హామీలు గుప్పించిన పాలకులు, జీవోను బేషరతుగా రద్దు చేయకుండా మీనవేషాలు లెక్కిస్తున్నారని వాపోయారు. బదిలీల చట్ట రూపకల్పనకు, విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చర్చించడానికి ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు ఆహ్వానించదగ్గ పరిణామమే అయినప్పటికీ, ఆ పేరుతో ప్రాథమిక పాఠశాలలను విలీనం చేసి, ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. అన్ని మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఐదు తరగతులు బోధించడానికి ఐదు గురు ఉపాధ్యాయులను నియమించాలని, విద్యార్థుల సంఖ్య 75కు మించితే పిఎస్‌హెచ్‌ఎం పోస్టును అదనంగా కేటాయించాలని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య 121 మించితే 6వ ఎస్‌టిజిని, ఆపైన ప్రతి 30 మందికి ఒక ఎస్‌టిజిని కేటాయించాలని ఉపాధ్యాయ సంఘాలు చేసిన సూచనను పరిగణలోకి తీసుకోలేదన్నారు. ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియాన్ని కొనసాగించాలని, జీవో 610 ద్వారా వచ్చిన ఉపాధ్యాయుల సీనియార్టీకి రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టి విద్యా భవన్‌ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, పి.మురళీకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, డి.రూతు ఆరోగ్య మేరి, ఐక్య ఉపాధ్యాయ పత్రిక జిల్లా ఇన్చార్జి జి.గోపీనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.చంద్రశేఖర్, ఎస్.దేవానందం, ఎ.డి.దేవ దత్తం, రామకేశవ, గురు మోహన్, ఈశ్వరరావు, సురేష్ కుమార్, నాగిరెడ్డి, ఎంవిఎస్ రాజు, శివకుమార్ రాజు, శివ శంకర్,చెన్నకేశవులు, సుబ్బారెడ్డి, కిరణ్ కుమార్, చెన్నయ్య, జావిద్, శ్రీని వాసాచారి, శ్రీనివాసులు, విశ్వనాథ్ కడప నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరీముల్లా, హిఫా జతుల్లా పాల్గొన్నారు. ఎం.వి.ఎఫ్ నాయకులు వెంకటరమణ ధర్నాకు మద్దతు తెలిపి ప్రసంగించారు.

ప్రయివేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

వినతి పత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేట్ డయాగ్నొస్టిక్స్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీంనాల శివకుమార్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారాల వేదికలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, బద్వేలు లాంటి ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనల కు విరుద్ధంగా ప్రయివేట్ డయాగ్నొస్టిక్ స్కానింగ్ సెంటర్లు నడుస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి డయాగ్నొస్టిక్ స్కానింగ్ సెంటర్ల లోప టెస్టుకు ఎంత ధరో ధరల పట్టిక లేవన్నారు. పేద ప్రజల వద్ద అధిక ధరలతో ఫీజులు వసూలు చేస్తూ కట్టిన డబ్బులకు రశీదులు కూడా ఇవ్వకుండా మోసం చేస్తున్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఉద్యోగంలో లేరన్నారు. ఇదంతా తెలిసిన వైద్య శాఖ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. తూతూ మంత్రంగా డమ్మీగా ముందస్తు సమాచారం ఇచ్చి తనిఖీలు చేస్తున్నారని ఆరో పణలు ఉన్నాయని తెలిపారు. వైద్య శాఖ అధికారులు లోపం స్పష్టంగా కనబ డుతుందని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా కచ్చితమైన తనిఖీలు నిర్వ హించి నిబంధనలు పాటించని డయాగ్నొస్టిక్ స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో కలెక్టం ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారించి న్యాయం చేయాలని పేర్కొన్నారు. తొలుత జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పిజిఆ ర్ఎస్ దరకాస్తులపై ఆయా జిల్లా అధికారులతో సమీక్షించారు.చింతకొమ్మదిన్నె మండలం నాగిరెడ్డి పల్లెకు చెందిన కె. వెంకటలక్షుమ్మ తన ఇంటి ముందు సిసి రోడ్డు వేయాలని, అలాగే తన పొలం వద్ద కరెంట్ పోలు, ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలని అభ్యర్తించారు. కడప మండలం, మామిళ్ల పల్లికు చెందిన ఉరవకొండ ప్రమీల రాణి, ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్‌లో అడ్మిషన్ సీట్ కోసం విన్నవించారు. కడప గాంధీ నగర్‌కు చెందిన ఎం. గంగా దేవి పులివెందుల టౌన్‌లోని ఎస్‌టి బాలుర వసతి గృహాన్ని నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఎస్‌డిసిలు శ్రీనివాసులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంప్డ్ స్టోరేజీ హైడ్రో ప్రాజెక్టుకు లైన్ క్లియర్

- జిఒఎంఎస్ నెంబర్ 152 జారీ
- 46 ఏళ్లకు 191.64 ఎకరాలు లీజు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని కొండాపురం మండలం కె.బొమ్మేపల్లి సమీపంలో అదానీ ఎనర్జీ లిమిటెడ్ నిర్మించనున్న పంప్డ్ స్టోరేజీ హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ప్రభుత్వం సోమవారం జిఒఎంఎస్ నెంబర్ 152 జారీ చేసింది. 191.64 ఎకరాలను కేటాయించినట్లు పేర్కొంది. ముఖ్య మంత్రి చంద్ర బాబునాయుడు అధ్యక్షతన గురువారం నిర్వహించిన కేబినెట్ సమా వేశంలో తీర్మానించిన సంగతి తెలి సిందే. జిల్లా రెవెన్యూ యంత్రాంగం నివేదిక ఆధారంగా కొండాపురం మండలం బొమ్మేపల్లి గ్రామ సర్వే నెంబర్ 307లోని 150 ఎకరాలు, 308 సర్వే నెంబర్‌లోని 41.64 ఎకరాల్లో అదానీ గ్రీన్‌ఎనర్జీ లిమి టెడ్ వెయ్యి మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆమోదం తెలిసిన సంగతి తెలిసిందే సహజ ఇంధన వనరుల సంస్థ (నెడ్‌క్యాప్) ద్వారా ఎకరానికి ఏడాదికి రూ.31 వేల చొప్పున లీజుకు ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఐదు శాతం పెరుగుదల ప్రాతిపదికన లీజు చెల్లించనున్నట్లు పేర్కొంది. కేబినెట్ ముగిసిన నాలుగు రోజుల వ్యవధిలోనే 46 ఏళ్ల పాటు లీజుకు ఇస్తున్నట్లు జీవో జారీ చేయడం గమనార్హం. ఈలెక్కన మూడు నుంచి ఆరేళ్ల వ్యవధిలో పంప్డ్ స్టోరేజీ హైడ్రో ప్రాజెక్టు నిర్మాణాన్ని సాకారం చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన పాలనా పరమైన అనుమతులు జారీ చేయడం గమనార్హం. నిబంధనలు ఉల్లంఘించినా, ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఉపయోగించుకోని పక్షంలో రద్దు చేసే అధికారం కలెక్టర్‌కు ఇచ్చినట్లు పేర్కొంది.

పురాతన నాణేలు, నోట్లను చూస్తున్న విద్యార్థులు

పురాతన నాణేలు ప్రదర్శన

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం లో భాగంగా సోమవారం పురాతన నాణేల ప్రదర్శన నిర్వహించారు. రాయలసీమ నాణేల సేకరణ సంఘం వారి ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యవర్గ సభ్యుడు యస్. రంగనాథ్ పర్యవేక్షణలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్. అమీరుద్దీన్ ఆహ్వానం మేరకు ప్రపంచ దేశాల నాణేలు, నోట్లు, వివిధ రాజుల కాలం నాటి పురాతణ నాణేలు ప్రదర్శించారు. ప్రజలు, విద్యార్థుల విజ్ఞానం కోసం క్రీస్తు పూర్వం నుంచి క్రీస్తు శకం వరకు వినియోగంలోని నాణేములతో పాటు ఇండో గ్రీకులు, ఇండో ససానియన్, కోటి లింగాల నాణేలు, శాతవాహనులు, ఇక్ష్వాకులు,సిబాకరాజులు, హిరాణ్యక, ఆనంద గోత్రికులు, గుప్తులు, విష్ణుకుండిణులు, మగదరాజులు, వల్లవులు, చోళులు, ఉజ్జయిని రాజులు. జూనాఫుడ్, విజయనగర సామ్రాజ్య నాణెములు, హోయసాలలు, అక్టర్, అల్లాఉద్దీన్, ఖిల్జి, షాజహాన్, బెరంగజేబు, దీప్పూ సుల్తాన్, మైసూర్ రాజుల నాణేలు ప్రదర్శించారు. రెండవ ప్రపంచ యుద్ధకాలం నాటి నోట్లు, వివిధ దేశాలలో ఉన్నటివంటి ప్లాస్టిక్ నోట్లను ప్రదర్శనలో విద్యార్థునులు వీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రెరియన్ ఇ.పవన్ కుమార్, అసిస్టెంట్ లైబ్రెరియన్ నాదెండ్ల బాబ్జి, జేమ్స్, గ్రంథాలయంలో సిబ్బంది సుబ్బమ్మ, పాఠకులు ఆధ్యాత్మిక, రీసెర్చ్ రీడర్,జయ సుబ్బారెడ్డి, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

కళాజాతా బృందంచే ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగ ఆధ్వర్యంలో కళాజాత బృందంచే హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె. నాగరాజు పేర్కొన్నారు. సోమవారం కళాజాత బృందాన్ని జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ అధికారి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ కళాజాత బృందంతో నాటకాల ద్వారా ఎయిడ్స్ వ్యాధి, రక్తదానం, సుఖ వ్యాధుల కౌన్సిలింగ్ కేంద్రాల గురించి తెలియజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారి డాక్టరు ఉమామహేశ్వరరావు మలేరియా అధికారి మనోరమ, డాక్టర్ రమేష్, అధికారులు పాజిటివ్ నెట్వర్క్ మహిళలు పాల్గన్నారు.

చెర్లోపల్లి రహదారి సమస్యను పరిష్కరించాలి

- ధర్నాలో సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

నగర శివారు పరిధిలో ఉన్న చెర్లోపల్లి లేఔట్ పేజ్ – 3 లో రహదారి సమస్యను టిడిపి మహానాడు లోపల పరిష్కారం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రహదారి, మంచినీరు, శ్మశాన వాటిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ 2008లో అప్పటి ప్రభుత్వం కడప నగరంలో ఉన్న పేదలను గుర్తించి వారందరికీ చెర్లోపల్లి లేఔట్ లో ఇళ్ల స్థలాలు కేటాయించారని గుర్తు చేశారు. కొన్ని సంవత్సరాలుగా కాలనీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. కాలనీలో నివసిస్తున్న ప్రజానీకానికి రహదారి లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తాగడానికి మంచి నీళ్ల కూడా కాలనీలో దొరకడం లేదని, తక్షణమే మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వ అధికార యంత్రాంగం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ నివసిస్తున్న ప్రజలు చనిపోతే శ్మశాన వాటిక కూడా అందుబాటులో లేదని, సుదూర ప్రాంతాలకు వెళ్లి దహనం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. టిడిపి మహానాడు జరిగే లోపల ఈ సమస్యలన్నీ పరిష్కారం చేయాలని పేర్కొన్నారు. లేని పక్షంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, చంద్రారెడ్డి రామకృష్ణారెడ్డి,నరసింహ, గోవిందు, శివకుమార్, రాహుల్, నరసింహ, హరిచంద్రారెడ్డి, ప్రవీణ్ కుమార్, విజయ్, సరిత, ఎస్.మల్లేశ్వరయ్య, టి.రామకృష్ణ, మల్లేశ్వర రెడ్డి, పి.సుబ్బరాయుడు, రెడ్డి బాష, పూల గోపి, సాహినా బాను, సావిత్రి, శ్రీలత పాల్గొన్నారు.

వీరజవాన్ కుటుంబానికి ఆర్థిక సాయం

- రూ.50 వేలు అందజేసిన డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి

ప్రజాశక్తి - కడప

వీరజవాన్ తల్లిని పరామర్శిస్తున్న డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి

వీర జవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి నియో జకవర్గ సమన్వ యకర్త లతో పరామర్శించారు. సోమవారం కాంగ్రెస్ శ్రీ సత్య సాయి జిల్లా, గోరం ట్ల మండలంలోని కల్లి తాండా గ్రామానికి వెళ్లి దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన వీర జవాన్ మురళి నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మురళి నాయక్ తండ్రి శ్రీ రాం నాయక్, తల్లి జ్యోతి భాయిని ఓదార్చి, ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. తరువాత కాంగ్రెస్ నాయకులు మురళీ నాయక్ సమాధిని సందర్శించి, పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె వీరజవాన్ కుటుంబానికి తన ఒక నెల పెన్షన్ మొత్తం రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా విలేకరులతో విజయజ్యోతి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర సైనికులు ఎప్పటికీ మరచి పోలేనివారని, మురళీ నాయక్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పులివెందుల, ప్రొద్దుటూరు, కమలాపురం అసెంబ్లీ సమన్వయకర్తలు దృవకుమార్ రెడ్డి, ఇర్ఫాన్ భాష ,అశోక్ కుమార్ రెడ్డి, పిసిసి డెలిగేట్ డాక్టర్ అన్వర్, డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్, మైనార్టీ నగర అధ్యక్షులు ముబారక్ బాషా, హరి ప్రసాద్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వాట్సాప్ ద్వారా ఎల్ఐసి ప్రీమియం చెల్లింపు

ప్రజాశక్తి - కడప అర్బన్

వాట్సాప్ ద్వారా ఎల్ఐసి పాలసీ ప్రీమియం చెల్లింపు సౌకర్యం ఈనెల 9 నుంచి అందుబాటులోకి వచ్చిందని కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి. రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఐసి సిఇఒ సిద్ధార్థ మహంతి ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారని పేర్కొన్నారు. ఇప్పటిదాకా ఎల్ఐసి కస్టమర్ పోర్టల్‌పై 2. 20 కోట్లమంది తమ పాలసీలను నమోదు చేసుకున్నారని తెలిపారు. రోజు మూడు లక్షల మంది ఆన్‌లైన్ సేవలు వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ వాట్సప్ బాట్ సౌకర్యం అదనంగా అందుబాటులోకి రావడంతో పాలసీదారులు ఎల్ఐసి ఆఫీసులకు వెళ్లాల్సిన పని లేకుండా, వారి పాలసీలపై ప్రీమియాలను చెల్లించవచ్చని తెలిపారు. 8976862090 వాట్సప్ నంబరుకు హాయ్ అని మెసేజ్ చేస్తే, మన పాలసీలపై చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఆ తర్వాత WhatsApp Bot నుంచే యుపిఐ, నెట్ బ్యాంకింగ్, కార్డ్స్ ద్వారా ప్రీమియం చెల్లింపులు చేయొచ్చని తెలిపారు. ఎల్ఐసి మరో 14 సేవలకు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. వాట్సప్ బాట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని పాలసీదారులకు తెలిపారు.

మాట్లాడుతున్న వ్యవసాయ డివిజన్ అధికారి కృష్ణారెడ్డి

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఖాధర్‌పల్లె సచివాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఎంటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై ప్రతి రైతూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ విధానం వల్ల అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతి రైతూ పాటించాలని తెలిపారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందిస్తామన్నారు. అనంతరం ఉత్తమ దిగుబడులను సాధించిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇన్‌ఛార్జి మహేష్, వివిఎ గిరిధర్ ,ఐసి ఆర్పీ వెంకటేశ్వర రెడ్డి, మాబు చాన్,వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలకే పరిమితమా!

ప్రజాశక్తి - వేంపల్లె

కడపలో బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం విస్తరణ పనులు శంకుస్థాపనలకే పరిమితం కావడం శోచనీయమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కడపలో ఉన్న బ్రౌన్ పరిశోధనా కేంద్రం ప్రతిష్టాకరమైన కేంద్రమని పేర్కొన్నారు. బ్రౌన్ లైబ్రరీ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం యోగి వేమన విశ్వ విద్యాలయానికి అనుసంధానం చేసిందని తెలిపారు. దీని విస్తరణ కోసం వైసిపి ప్రభుత్వం రూ 6.87 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. 2021 జులై 9న నాటి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి శంఖు స్థాపన చేశారని చెప్పారు. కాని పనులు మొదలు పెట్ట లేదన్నారు. రెడ్డి వచ్చే మళ్ళీ మొదలు పెట్టు అన్నట్లు మళ్ళీ శంఖు స్థాపనకు ముహూర్తం పెట్టారని విమర్శించారు. వివిధ కారణాల వల్ల శంఖు స్థాపన కార్యక్రమం ఆగిపోయినట్లు చెప్పారు. శంఖు స్థాపనల పేరుతో కాలయాపన చేయకుండా పనులు వెంటనే మొదలు పెట్టి పూర్తి చేసి ఒకేసారి ప్రారంభోత్సవానికి ఆహ్వాన పత్రికలు కొట్టిస్తే సమంజసంగా ఉంటుందని తులసిరెడ్డి ప్రభుత్వానికి సూచించారు.

అన్నమయ్య గొప్ప సంఘ సంస్కర్త

తాళపాలక అన్నమయ్య కేవలం వేంకటేశ్వర స్వామి భక్తుడే కాకుండా గొప్ప సంఘ సంస్కర్త అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి కొనియాడారు. అన్నమాచార్య 617 వ జయంతిని సోమవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ క్రీస్తు శకం 1408లో వైశాఖ పౌర్ణమి నాడు అన్నమయ్య అవతరించినట్లు చెప్పారు. ఆయన గొప్ప పదకవితా పితామహుడు అన్నారు. అలతి ఆలతి అచ్చమైన తెలుగు పదాలతో వేంకటేశ్వర స్వామి మీద 32 వేల భక్తి, శృంగార, వైరాగ్య సంకీర్తనలు రాశారని చెప్పారు. అన్నమయ్య తెలుగులో తొలి వాగ్గేయ కారుడని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న నాగరాజు, బద్రీ నాథ్ పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాల పట్ల అవగాహన కల్పించాలని ఎపి అభివృద్ధి వేదిక రాష్ట్ర కన్వీనర్ గంజికుంట నాగరాజు పేర్కొన్నారు. సోమవారం ఆయన దువ్వూరు స్టేట్ బ్యాంక్ అధికారులను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై ఆధారపడే రైతులకు అన్ని రకాల రుణాలను ఎలాంటి ప్రత్యేక ఆంక్షలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. బ్యాంకులోనే ఖాతాదారులకు అన్ని రకాల సేవలు అందించాలని కోరారు. బ్యాంకు ఖాతాదారులను మధ్యపెట్టి మినీ స్టేట్ బ్యాంకు ద్వారా లావాదేవీలు జరపడం వల్ల సర్వీస్‌కు కమిషన్ తీసుకొం టున్నారని అన్నారు. అన్ని రకాల సబ్సిడీ రుణాలపై ప్రజలకు చైతన్య సదస్సుల ద్వారా ప్రచారం నిర్వహించి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షులు చాగంరెడ్డి వీరనారాయణరెడ్డి, గొల్ల కుంట్ల అజయ్, బాలనాగిరెడ్డి, భూపాల్, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని విశ్వనాధపురం గ్రామం వద్ద కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం దువ్వూరు మండలం గుడిపాడుకు చెందిన గురివిరెడ్డి(65) స్థానిక ఆంజనేయ స్వామి గుడి వాచ్ మెన్‌గా పనిచేస్తున్నారు. ఆలయం వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో వృద్ధుడు అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - వేంపల్లె

అనుమానితులు ఎవరైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వేంపల్లె, ఆర్కే వ్యాలీ సిఐలు నరసింహులు, ఉలసయ్యలు పేర్కొన్నారు. ఎస్‌పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం తెల్లవారుజామున స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వివిధ చోట్ల ఇళ్లలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. స్థానిక ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి కొత్త వ్యక్తులు ఎవరైనా కాలనీకి వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అనుమానితులుగా ఉన్న వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రశాంత జీవనం గడపాలని ఎలాంటి సమస్య ఉన్న పోలీసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిం చుకో వాల న్నారు. అ వేంపల్లె పరిధిలో వాహనాల తనిఖీ నిర్వహించగా సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లె, వేముల, ఆర్కే వ్యాలీ, చక్రాయపేట ఎస్ఐ లు ప్రవీణ్ కుమార్, రంగారావు, చంద్రశేఖర్ లతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు సూచనలిస్తున్న సిఐ

నిరుపయోగంగా

పాల సేకరణ భవనాలు

పట్టని అధికారులు
ఇబ్బందుల్లో పాడి రైతులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పలు గ్రామాలలో పాల సేకరణ కేంద్రాలు నిరుపయోగంగా శిధిలావస్థలో ఉన్నాయి. 38 సంవత్సరాల కిందట సిద్ధారెడ్డి పల్లి, నాగులపల్లి, విశ్వనాధపురం, ఓబుల్‌రెడ్డి పేట, చిన్నగు రువలూరు, అనంతపురం, అన్నవరం, గ్రామాల్లో సహకార సంఘాలు ఏర్పాటు చేసి దాతల నుండి స్థలాలను సేకరించి పాలసేకరణ కేంద్రాల్లో నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన పాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రొద్దుటూరు, మైదుకూరు కేంద్రాలకు తరలించేవారు. కాలక్రమేనా ప్రభుత్వ కేంద్రాలు మూతపడటం ప్రయివేట్ పాల కేంద్రాలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ పాల సేకరణ కేంద్రాలు మరుగున పడ్డాయి. దీంతో భవనాలు చాలావరకు దెబ్బతిన్నాయి. సిద్ధారెడ్డిపల్లి గ్రామంలో ఏడేళ్ల కిందట పాలసేకరణ భవనానికి మరమ్మతులు చేపట్టి మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. అది రెండు సంవత్సరాలు కొనసాగిన తర్వాత మూతపడింది. ఓబుల్ రెడ్డి పేటలో భవనం ఇప్పటికీ ప్రయివేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో పాల సేకరణ కొనసాగుతుంది. మిగిలిన గ్రామాల్లో మాత్రం చాలా అధ్వానంగా మరుగున పడ్డాయి .ప్రభుత్వ కార్యాలయాల కోసం

మూతపడిన పాలసేకరణ కేంద్రం

వీటికి మరమ్మతులు చేసి వినియోగించుకునే అవకాశం ఉంది. విశ్వనాధపురంలో రోడ్డు విస్తరణలో కొంతభాగం భవనం తొలగించారు. పూర్తిగా దెబ్బతిన్న భవనాలను తొలగించి వాటి స్థానంలో ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకుంటే బావుంటున్న పలువురు పేర్కొన్నారు. గత ప్రభుత్వం అమూల్ పాల కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం పాల సేకరణకు ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టలేదు. శిథిలా వ్యవస్థకు చేరుకున్న భవనాలను తొలగించి ఆస్థానంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సిపిఎం

మాట్లాడుతున్న వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి - అట్లూరు

కార్మికులు, రైతులు వ్యవసాయ కార్మికులు ఉద్యోగ ఉపా ధ్యాయులు చేపట్టే దేశవ్యాప్త సార్వత్రికమ్మెను జయప్రదం చేయాలిన సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్వేష్, అట్లూరు మండల మండల కార్యదర్శి ఈ రమణయ్య తెలిపారు సోమవారం ఉదయం అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపైన నాలుగు లేబర్ కోడ్స్ విధించారు వాటి వల్ల కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. వారికి పర్మినెంట్ లేదు కట్టు బానిసలుగా 14 గంటలపాటు పనిచేయించునే పరిస్థితి ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు నెలల తరబడి జీతాలు ఇవ్వక పోవడం దారుణమని పేర్కొన్నారు. ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా రూ. 600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారన్నారు ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్, తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ప్రయివేట్ వ్యక్తులకు, కార్పొరేట్ సంస్థలకు ధారదతం చేస్తు న్నారన్నారు. యువతకు ఉపాధి కల్పించే స్టీల్ ప్లాంట్‌ను కడప జిల్లాలో నెలకొ ల్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు భూ పంపిణీ అమలు చేయా లని కోరారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్మిక కర్షక ఆధ్వర్యంలో మే 20 సార్వత్రిక సమ్మెను సిపిఎం ప్రత్యక్షంగా పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు దుర్గమ్మ, స్వప్నమ్మ, నారాయణమ్మ, రవిచంద్ర, గోపయ్య,పెద్ద నారాయణ పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప

ఆర్ఎల్ చెస్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కావలిలో నిర్వహించిన రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కడప జిల్లా క్రీడాకారులు విజయం సాధించి బహుమతులు గెలుచుకున్నారు. అండర్-15 బాలికల విభాగంలో తేజుమయి మొదటి స్థానం సాధించి విజేతగా నిలిచింది. అండర్ -13 బాలికల విభాగంలో లాస్య శ్రీ మొదటి స్థానంలో నిలిచి విజేతగా నిలిచింది. అండర్ - 13 బాలుర విభాగంలో తరుణ్ 2వ స్థానంలో నిలిచాడు.

విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

రెహాన్ 3వ స్థానంలో నిలిచాడు. అండర్ -7 బాలుర విభాగంలో దీక్షిత్ 4వ స్థానంలో నిలిచాడు. అలీముద్దీన్ 3, సారాయు 3, అజిత్ 3, అర్హన్ 3, ధనిత 3, అభిజిత్ 2.5, ప్రణవ్ స్వరూప్ 2 పాయింట్ల స్కోరు సాధించారు. చదరంగం రంగంలో కడప జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఆయనను ఆర్ఎల్ చెస్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చెస్ రంగంలో అనీస్ దర్బార్‌కు విశేష గౌరవం లభించింది.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

- మంత్రి నారా లోకేష్‌కు బిటెక్ రవి విన్నపం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కోరారు. సోమవారం విజయవాడలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, పెండింగ్ పనులను వివరించారు. పాడ నిధులో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిపోయాయయని, దీంతో ప్రజలు పలు అవస్థలు పడుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన మంత్రి పులివెందుల నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బిటెక్ రవితో పాటు పులివెందుల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కష్టపడ్డవారికే నామినేటెడ్ పదవులు ఇవ్వాలి
- డాక్టర్ జి.వి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నామినేటెడ్ పదవుల్లో కష్ట కాలంలో పనిచేసిన వారికే పదవులు దక్కాలని డాక్టర్ జి.వి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంత్రి నారా లోకేష్ నాయుడును ఆయన నివాసంలో కలిసి డాక్టర్ జి.వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రొద్దుటూరు

మంత్రి నారా లోకేష్‌తో బిటెక్ రవి, జి.వి . ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నియోజకవర్గంలో ఇవ్వబోయే నామినేటెడ్ పదవులను పార్టీ కోసం పనిచేసిన వారికే స్థానం కల్పించాలని కోరారు. వైసిపి పాలనలో ప్రొద్దుటూరులో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులు, రౌడీ షీట్లను తొలగించాలన్నారు. ప్రొద్దుటూరు మార్కెట్ నిర్మాణం కోసం మున్సిపాలిటీలో నిధుల కొరత కారణంగా నిలిచిన పనులకు ప్రభుత్వమే నిధులు ఇచ్చి పూర్తి చేయాలన్నారు. ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల పైన సిట్ వేసి విచారణ జరిపించాలని పేర్కొన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వైభవంగా మొలకల పున్నమి

- సందడి చేసిన జర్మనీ దేశీయులు
- వ్యవసాయ పద్ధతులను పరిశీలించిన విదేశీయులు

ప్రజాశక్తి - వేముల

భారతీయ సంస్కృతిలో వ్యవసాయంలో రైతులు మొలకల పున్నమి పండగా చేసుకుంటున్నారు. సోమవారం మండలంలోని స్థానిక దుగ్గన్న గారి పల్లి గ్రామంలో మొలకల పున్నమి వైభవంగా నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు విధానం, మహిళా రైతులు అనుసరిస్తున్న పద్ధతులను సందర్శించడానికి జర్మనీదేశస్థులు గ్రామానికి రావడంతో వారికి రైతులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. జర్మనీ దేశీయులైన జూలీ తుమ్లక్, తిమ్ ఎక్కుమ్యన్, డాక్టర్ చంద్రశేఖర్, బి రాడార్‌ను మహిళా రైతులు విదేశీయులకు మన భూ భాగంలో ప్రకృతి పరంగా పూసిన పువ్వులతో అల్లిన పూల కుచంతో ఆహ్వానించారు. భారతీయ సంస్కృతితో హారతి ఇచ్చి కోలాటం కళా నృత్యంతో స్వాగతం పలికారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో ఘనజీవామృతం, జీవామృతం తయారు చేసే విధానం, ఖాళీగా ఉన్న బీడు భూముల్లో (పిఎండిఎస్) నవధాన్యాల పద్ధతిని వారికి వివరించారు. 25 రకాల విత్తనాలను ,విత్తన గుళికలు తయారుచేసి వారిచే విత్తించారు. రైతులు నిర్వహించే మొలకల పున్నం పండుగ ప్రాముఖ్యత ను మహిళా రైతులు వివరించారు. మొలకల నవధాన్యాలను విదేశీయులు తిలకించారు. పండగ విశిష్టత 365 రోజులు భూమిని పచ్చగా కప్పి ఉండాలని మొలకల పున్నమిని ఘనంగా నవధాన్య సాగుతూ ప్రారం భించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ ప్రభాకర్ రెడ్డి, డిపిఎం ప్రవీణ్ కుమార్, అడిషనల్ డిపిఎం వసంత కుమారి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు, డాక్టర్ సందీప్, సోహెల్, మాస్టర్ ట్రైనర్

కోలాటం ద్వారా విదేశీయులకు స్వాగతం పలుకుతున్న మహిళలు

భాస్కర్ రెడ్డి, కమ్యూనిటీ కో – ఆర్డినేటర్ నాగేశ్వరి, గ్రామ సర్పంచ్, ఉత్తమ రైతులు మండల వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండలంలో మొలకల పౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం మండలంలోని గురజాల, చెర్లోపల్లి, కడప నాగయ్య పల్లె, బలపనూరు బిధనంచర్ల, తదితర గ్రామాలలో మహిళలు గౌరమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల నుంచి మొలకల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పౌర్ణమి రోజున గ్రామ పురవీధులలో మొలకల కుంపట్లను బ్యాండ్ మేళం నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఆయా గ్రామాలలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని గౌరమ్మను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

తొండూరు : మండల కేంద్రంలో మొలకల పున్నమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల కిందట నానబెట్టిన ధాన్యం మొలకలను మహిళలు తలపై పెట్టుకొని గ్రామంలో ఊరేగింపు చేస్తూ కొబ్బరికాయలు కొట్టారు. శివాలయంలో మొలకలను ఉంచి పాటలు పాడుతూ రైతులు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో రైతులు సుధాకర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, లోకేష్ రెడ్డి, చిన్న నాగిరెడ్డి, అమీర్ బాషా, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

కళాశాల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మఠంలోని కస్తూర్బా పాఠశాలలో రూ. 1.32 కోట్లతో నిర్మించబోయే కళాశాల పనులకు సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సోమవారం భూపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యను బోధించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఆయా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలముగా స్పందించిన ఆయన పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యానందరాజు, ఇఇ గురువిరెడ్డి, ఎఇ ప్రసాద్, కస్తూర్బా గాంధీ స్కూల్ పాఠశాల ఎఒ అనూష, టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు ఎల్లటూరు సాంబశివారెడ్డి, ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి, కానాల మల్లికార్జున్ రెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్, పూజ శివయ్య, నరసింహ పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో వైశాఖ మాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా సోమవారం మొలకల పౌర్ణమి ఆంజనేయ స్వామి తిరుణాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలు, ఎద్దుల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఎపిఐఐసి రాష్ట్ర మాజీ డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ రెడ్డి ఉదయం అల్పాహార కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం బండలాగుడు పోటీలను ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. బండలాగుడు పోటీలను తిలకించడానికి జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు గ్రామ పెద్దలు బహుమతులను అందజేశారు.

ఉర్దూ డిఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి : రూట

ప్రజాశక్తి -కడప అర్బన్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడప, కృష్ణ, గుంటూరు, బాపట్ల, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఉర్దూ డిఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, ఉర్దూ రేంజ్) పోస్టులు అర్హులైన వారితో భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసో సియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాఖ్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణకు, విద్యా ర్థుల విద్యాభివృద్ధికి, ఉర్దూ ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉర్దూ డిఐలు ఎంతో దోహదపడతారని తెలిపారు. ఉర్దూ డిఐలు లేని కారణంగా గత దశాబ్ద కాలంగా ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో నష్టపో యాయరని పేర్కొన్నారు. ఉర్దూ డిఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు.

మున్సిపాలిటీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు పట్టణం 2012లో గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారి 14 సంవత్సరాలు అవుతున్నా మౌలిక వసతులకు కూడా నోచుకోలేదని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎ.వి. రమణ పేర్కొన్నారు. సోమవారం మౌలిక వసతులపై కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు పట్టణ ప్రజలకు ఆక్రమణలు లేని సౌకర్యవంతమైన రోడ్లు, మురుగు లేని డ్రెయినేజీ, దుమ్ము, ధూళి లేని వీధులను కోరుకుంటున్నారని వెంటనే అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి మైదుకూరు పట్టణ, మండల సమితి నాయకులు కె. రామ్మోహన్, శ్రీనివాసులు, పాములేటి నరసింహ, తలారి సైమన్ పాల్గొన్నారు.

వేడుకగా త్యాగరాజ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక గాండ్ల వీధిలో(ఆర్టీసీ బస్టాండ్ పక్కన) వెలసిన నూతన త్యాగరాజ ఆలయంలో త్యాగరాజ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, విగ్రహ ప్రాణ ప్రతిష్ట, గో దర్శనం, జ్వాలా దర్శనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు త్యాగరాజ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. నాయి బ్రాహ్మణులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించు కున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు స్థానిక ఉర్దూ షాది ఖానా కల్యాణ మండపంలో గొప్ప నాదస్వర కచేరి ని నిర్వహించారు. కార్యక్రమానికి మహి ళలు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు వెంకటరత్నం, గౌరవ అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాడవీధుల అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం : మండల కేంద్రంలోని స్వామివారి మాడ వీధుల అభివృద్ధి కోసం సాఫీ యాజమానులు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఫిట్ పర్సన్ శంకరబాలాజీ పేర్కొన్నారు. సోమవారం ప్రతిషాపు యాజమాని వద్దకు వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. మఠం అభివృద్ధికి సహకరిస్తామని వారు ఫిట్ పర్సన్‌కు తెలిపారు.

ఎపిఎన్‌జిఒ కడప సిటీ యూనిట్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి ఎన్‌జిఒ కడప సిటీ యూనిట్ ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు ఆధ్యర్యంలో కడప సిటీ ఎన్నికలు అధికారి గా యం.బాలపుల్లయ్యను, సహాయ ఎన్నికల అధికారి పోలిరెడ్డిని, పరిశీలకులు డి.రవికుమార్‌ను నియమించారు. ఎన్నికల అధికారి యం.బాల పుల్లయ్య మాట్లాడుతూ కడప సిటీ ఎన్‌జిఒ అసోసియేషన్ సీటీ యూనిట్ ్ప 22 పోస్టులకు గాను ఒక్కొక్క నామినేషన్ మత్రమే దాఖలు అయినందువల్ల మొత్తం సంఘసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, కార్యదర్శి డి.రవికుమార్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిటీ అధ్యక్షులు కె.చిన్నయ్య, కార్యదర్శి పి.శైలేశ్వేర్ రెడ్డి, సహ అధ్యక్షులు జె.శ్రీనివాసన్, కోశాధికారి ఆర్. వి. నాగార్జున రావు, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్నికైన నాయకులతో జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు